క్లుప్తంగా

మధ్యాహ్న భోజన వర్కర్ల వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

జగిత్యాలటౌన్:మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు చెల్లించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ నాయకులు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్మికులు మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు, అల్పాహార బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని కోరారు. లేకుంటే నిధులు ల్యాప్స్ అయ్యే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వెన్న మహేష్, ఎండీ.ముక్రం, లక్ష్మి, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపించకుండా చూడాలి



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాలటౌన్: పండుగల నేపథ్యంలో పట్టణంలో పారిశుధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఆలయాలు, మసీదు, ఈద్గా ప్రాంతాల్లో పర్యటించిన చైర్మన్ మాట్లాడుతూ పండుగల సందర్భంగా ఆలయాలు, మసీదులు, ఈద్గాల వద్ద ఎలాంటి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. డ్రైయినేజీలు, రోడ్లు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లించాలన్నారు. కౌన్సిలర్ కల్లెపెల్లి దుర్గయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కూరగాయల వ్యాపారులకు సౌకర్యాలు



టాయ్‌లెట్స్ ఏర్పాటు పరిశీలిస్తున్న కమిషనర్

కోరుట్ల: పట్టణంలోని గడిబురుజుల వద్ద కూరగాయల వ్యాపారులు సౌకర్యాలు లేని కారణంగా తైబజారు రుసుం చెల్లించబోమని ఆందోళన చేపట్టగా సోమవారం మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి వ్యాపారులకు పూర్తి సౌకర్యాలు కల్పించారు. తాగునీటి వసతి మెరుగు కోసం అక్కడే ఉన్న సిస్టన్ బాగు చేయించడంతో పాటు షీటాయ్‌లెట్లు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లను పరిశుభ్రం చేయించి వాడుకలో ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ, కూరగాయల వ్యాపారులకు అన్ని సౌకర్యాలు కల్పించినందును తైబజారు రుసుము ఎప్పటికప్పుడు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ లక్ష్మీ, మున్సిపల్ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

అట్రాసిటీ కేసులో డీఎస్పీ విచారణ



విచారిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు

మల్లాపూర్: మండలంలోని సాతారంలో అట్రాసిటీ కేసుపై సోమవారం మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు విచారించారు. ఇటీవల స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన అట్రాసిటీ కేసుపై డీఎస్పీ సాతారంలో పర్యటించి ఫిర్యాదుదారుడితో పాటు ప్రత్యక్ష సాక్షులను విచారించారు. డీఎస్పీ వెంట ఎస్సై కిరణ్‌కుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అపరిశుభ్రంగా ఆలయ పరిసరాలు

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, వెంటనే అధికారులు చర్యలు చేపట్టాలని సోమవారం బీర్‌పూర్‌కు చెందిన యువ చైతన్య యూత్ సభ్యులు డిమాండ్ చేశారు. ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని, స్వామివారి కోనేరులో కప్పలు చనిపోయాయని, మట్టి, చెత్త పేరుకుపోయిందని ఇది అధికారులు నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. దీనిపై అక్కడ ఉన్న సిబ్బందిని నిలదీశారు. ఈ విషయంపై ఈవో శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేయగా, వెంటనే చర్యలు తీసుకుంటామని ఈవో హామీ ఇచ్చినట్లు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు హరీశ్, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

‘అభయహస్తం’ పై మహిళల ఆశలు

- పథకం పునరుద్ధరించాలని కోరుతున్న మహిళా సంఘాలు
- గతంలో రద్దు చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం
- అమలు చేస్తే మహిళలకు ఎన్నో ప్రయోజనాలు



సమావేశంలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలు (ఫైల్)

పెగడపల్లి: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు ‘అభయహస్తం’ బీమా పథకంపై ఆశలు పెంచు కున్నారు. సంఘాల్లోని మహిళలకు బీమా కల్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ‘అభయహస్తం’ పథకం అమలు చేశారు. రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేసింది. పదేళ్ల విరామం తరువాత తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ‘అభయహస్తం’ బీమా పథకాన్ని మళ్లీ పునరుద్ధరిస్తారన్న ఆశాభావంతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. దీని కోసం జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో సెర్ప్, మున్సిపాలిటీల్లో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానాలు చేసి ప్రభుత్వానికి పంపిస్తున్నారు. 2009లో అప్పటి సీఎం రాజశేఖర్‌రెడ్డి ఎల్ఐసీతో కలిసి స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళల కోసం ×అభయహస్తం× ప్రారంభించారు. ఈ పథకంలో 18 నుంచి 59 ఏళ్ల లోపు వయస్సు కలిగిన మహిళలు 90503 సభ్యులుగా చేరి ఏడాదికి రూ. 335 చొప్పున ప్రీమియం చెల్లించారు. 59 ఏళ్ల వయస్సు నిండే వరకు ప్రీమియం చెల్లించాలి. 60వ సంవత్సరం నుంచి చివరి మజిలీ వరకు నెలకు రూ. 500 నుంచి రూ. 2250 వరకు మహిళలకు అభయహస్తం కింద పింఛన్ వచ్చేది. పాలసీదారు చనిపోతే అంత్యక్రియల ఖర్చులకు రూ. 5 వేలు, సహజ మరణానికి రూ. 30 వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 75,000 పరిహారం అందుతుంది. పాలసీదారుకు 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుకునే పిల్లలు ఉంటే ఇద్దరికి రూ. 1200 చొప్పున ఉపకార వేతనం అందేది. సభ్యులు 2009 నుంచి 2013 వరకు ఏటా రూ. 335 చొప్పున ఐదేళ్లలో రూ. 3,03,18,505 వరకు ప్రీమియం చెల్లించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాత అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం అభయహస్తం బీమా పథకాన్ని రద్దు చేసింది. అప్పటి నుంచి అభయహస్తం అమలు కాకపోగా, మహిళలు చెల్లించిన ప్రీమియం డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదు. 2022 జనవరిలో ప్రీమియం డబ్బుల లెక్కపత్రాలు సిద్ధం చేయాలని డీఆర్డీఏలను ప్రభుత్వం ఆదేశించడంతో గత మార్చిలో సాంకేతిక సిబ్బంది పాలసీదారుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాలు అప్‌డేట్ చేశారు. చనిపోయిన వారి కుటుంబాల నామినీల వివరాలు సేకరించినా తర్వాత ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కొత్త ప్రభుత్వం పథకాన్ని పునరుద్ధరించాలని, లేదా ప్రీమియం డబ్బులు వడ్డీతో సహ చెల్లించాలని మహిళలు కోరుతున్నారు.

నాకు పింఛన్ వచ్చేది



నేను స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిని. అభయహస్తం పథకంలో ప్రీమియం చెల్లించాను. నాకు నెలకు రూ. ఐదు వందలు పింఛన్ వచ్చేది. ప్రస్తుతం పథకం అమలులో లేకపోవడంతో వచ్చే పింఛన్ ఆగిపోయింది. ప్రభుత్వం పథకాన్ని పునరుద్ధరించాలి. లేదంటే మేము చెల్లించిన ప్రీమియం సొమ్ము వడ్డీతో కలిపి అందించాలి.

– కాటం విజయ పెగడపల్లి

పథకాన్ని అమలు చేయాలి



టీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసిన అభయహస్తం పథకం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అమలు చేయాలి. ఈ పథకంలో అమలులో ఉన్నప్పుడు నెలకు రూ. 500 పింఛన్, ఇంట్లో 8 నుంచి ఇంటర్ చదివే పిల్లలు ఉన్న వారికి ఏడాదికి రూ. 1200 చొప్పున ఉపకార వేతనం అందాయి. పథకం పునరుద్ధరణకు కొత్త ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బుర్ర నాగలక్ష్మి, నంచర్ల

ప్రభుత్వ నిర్ణయం మేరకు..



అభయహస్తం పథకం అమలు, లబ్ధిదారులు చెల్లించిన డబ్బుల చెల్లింపుల విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాలేదు. ప్రభుత్వం నిర్ణయం మేరకు నడుచుకుంటాం. జిల్లాలో అభయహస్తం పథకం లబ్ధిదారుల వివరాలు సేకరించి అప్‌డేట్ చేశాం. ఈ పథకంలో సభ్యులైన మహిళలందరీ వివరాలు అందుబాటులో ఉన్నాయి.

– సంపత్‌రావు డీఆర్డీవో

అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే



దోమలకుంట అంగన్‌వాడీలో చిన్నారులు

పెగడపల్లి:మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. బతికపల్లి, దోమలకుంట, శాలపల్లి, సుద్దపల్లి గ్రామాల్లోని కేంద్రాల్లో చిన్నారులు, వారి తల్లులతో కలిసి అంగన్‌వాడీ వార్షికోత్సవ వేడుకలు చేపట్టారు. చిన్నారుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసం పలు ప్రదర్శనలు చేయించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మహేశ్వరీ మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల ద్వారా ప్రీస్కూల్ విద్యతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

కథలాపూర్: మండలంలోని తక్కళ్లపెల్లి, కథలాపూర్, భూషణరావుపేట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సోమవారం పూర్వ ప్రాథమిక విద్యా దినోత్సవం వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వివిధ అంశాల్లో చూపిన ప్రతిభను తల్లిదండ్రులకు వివరించారు. గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిన్నారులకు అసెస్మెంట్ కార్డులు అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతికి ప్రభుత్వ విప్‌కు ఆహ్వానం



ప్రభుత్వ విప్‌ను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు

వెల్గటూర్ : ఈ నెల 14న నిర్వహించనున్న అంబేడ్కర్ జయంతికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్‌ను అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. సోమవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లక్ష్మణ్ కుమార్‌ను కలిసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ రేగొండ నర్సయ్య, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దళితులకు అండగా ఉంటా

ధర్మపురి: తన గెలుపుకోసం పనిచేసిన దళితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. పట్టణంలో సోమవారం దళిత నాయకులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో విప్ మాట్లాడారు. దళితులు ఏ సమస్య వచ్చినా తనను సంప్రదించాలని సూచించారు. నాయకులు ఎస్.దినేష్, చిలుముల లక్ష్మణ్, పారపెల్లి రాజమల్లయ్య, అరికిల్ల సతీష్, మోకెనపెల్లి శ్రీనివాస్, రాయిల్ల రవికుమార్ తదితరులున్నారు.

విద్యార్థులు అవకాశాలను వినియోగించుకోవాలి



పట్టా అందిస్తున్న పిల్లల వైద్యులు దిలీప్‌రావు

కథలాపూర్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదవాలని, వచ్చిన అవకాశాలను సద్వినియోగించుకోవాలని కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్యులు దిలీప్‌రావు అన్నారు. సోమవారం కథలాపూర్ మండలకేంద్రంలోని మాస్టో హైస్కూల్‌లో ‘గ్రాడ్యుయేషన్ డే’ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడాలంటే విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పోటీ ప్రపంచానికి ధీటుగా రాణించాలంటే ఆధునిక టెక్నాలజీ అవసరమని, టెక్నాలజీ అంటూ సెల్‌ఫోన్‌లకు బానిస కావద్దని విద్యార్థులకు సూచించారు. యూకేజీ టాపర్‌లకు గ్రాడ్యుయేషన్ పట్టాలు అందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆకుల రాజేశ్, హెచ్ఎం ఆకుల రంజిత్, రాజేందర్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పోటీ



మాట్లాడుతున్న లింబాద్రి

జగిత్యాల: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ పార్టీ పోటీకి సిద్ధంగా ఉందని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింబాద్రి అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడతూ మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్ర జరుగుతుందని, బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వర్గాలకు చెందిన మేధావులు ఆలోచించి ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు చిర్ర శంకర్, మల్లేశ్ యాదవ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా భూషణ్



భూషణ్

ఇబ్రహీంపట్నం: లయన్స్ క్లబ్ ఇబ్రహీంపట్నం అధ్యక్షుడిగా గూడ ఎలిసె శాంతి భూషణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు సోమవారం తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా బోనగిరి భూమేశ్, ట్రెజరరీగా మార బుచ్చన్నను ఎన్నుకున్నట్లు తెలిపారు. శాంతి భూషణ్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య క్యాంపులను ఏర్పాటు చేసి ఉచితంగా సేవలు అందిస్తామని తెలిపారు.

బీజేపీ రామాజీపేట బూత్ అధ్యక్షుడిగా బోయిని నరేందర్

రాయికల్: మండలంలోని రామాజీపేట గ్రామ బీజేపీ బూత్ అధ్యక్షుడిగా బోయిని నరేందర్‌ను నియమిస్తూ సోమవారం మండల అధ్యక్షుడు అన్నవేనివేణు నియమక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మహేశ్, మండల ఉపాధ్యక్షుడు కోలశంకర్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బాల్కొండ ఎన్నికల పరిశీలకుడిగా మున్ను



మున్ను

రాయికల్: నిజామాబాద్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా బాల్కొండ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం ఎన్నికల పరిశీలకులుగా రాయికల్ పట్టణానికి చెందిన మహ్మద్ ముస్తాక్ అహ్మద్ (మున్ను)ను నియమిస్తూ ఏఐసీసీ మైనార్టీ ఇన్‌చార్జి వైస్ చైర్మన్ ఫర్హాన్ అజ్మి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గం ఎన్నిక

మెట్‌పల్లి: బీసీ సంక్షేమ సంఘ కార్యవర్గంను సోమవారం నియమించారు. సంఘం పట్టణ ప్రధాన కార్యదర్శిగా కలికోట శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా మారంపల్లి సదానందం, కార్యదర్శిగా శంబోజి వివేక్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా నేరేళ్ల వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా తప్పెట రజిని, యూత్ అధ్యక్షుడిగా గుండవేని శేఖర్‌ను నియమించారు. నియామక పత్రాలను రాష్ట్ర కార్యదర్శి బొమ్మెల శంకర్, జిల్లా అధ్యక్షులు నల్ల వెంకటేశ్వర్లు, పట్టణాధ్యక్షుడు మాచర్ల సదానందం వారికి అందజేశారు.

నీటి కొరతపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్: గ్రామాల్లో నీటి కొరతపై కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం కథలాపూర్ మండలం అంబారిపేట, కలిగోట, పోసానిపేట గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఆయా వాడల్లో తిరిగి నీటి సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ట్యాంకులకు నీరందించే బోరుబావుల్లో నీళ్లు లేకుంటే అద్దెకు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, ఎంపీవో ప్రవీణ్ ఉన్నారు.

నేడు పెగ్గెర్లలో జాతర

కథలాపూర్: మండలంలోని పెగ్గెర్ల గ్రామంలో మంగళవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేశామని, హాజరైన భక్తులకు అన్నదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. జాతరకు భక్తులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని గ్రామస్తులు కోరారు.

విద్యార్థులతోనే పాఠశాలకు పేరు ప్రతిష్టలు



వీడ్కోలు వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

ధర్మపురి: విద్యార్థుల చదువు, వారి క్రమశిక్షణతో పాఠశాలకు మంచి కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెడుతాయని మండల విద్యాధికారి బత్తులు భూమయ్య అన్నారు. మండలంలోని దొంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో సోమవారం విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు



గుల్లపేట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది వేడుకల్లో హెచ్ఎం, టీచర్లు, విద్యార్థులు

మెట్‌పల్లి: పట్టణంలోని జ్ఞానోదయ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాల ఆవరణలో ఉగాది పచ్చడిని తయారు చేశారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లులలో ముందస్తు ఉగాది వేడుకలు నిర్వహించారు.సోమవారం ప్రయోగిల్లు ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఉగాది పచ్చడి తయారు చేసి పంచాంగ శ్రవణం పఠించారు.



కుస్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వేడుకలు..

మల్లాపూర్: మండలంలోని కుస్తాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం ముందస్తు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలను విద్యార్థులు ముస్తాబు చేసి పచ్చని తోరణాలు కట్టారు. అనంతరం షడ్రుచులతో ప్రత్యేకంగా తయరుచేసిన ఉగాది పచ్చడి చేసి ఆరగించారు. కార్యక్రమంలో హెచ్ఎం నూనావత్ రాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయికల్‌లోని పాఠశాలలో..

ధర్మపురి: పట్టణంలోని శ్రీ వాణి విద్యాలయంలో సోమవారం మందస్తు ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఉగాది పచ్చడి, రకరకాల తీపి పదార్థాలు తయారు చేసి విదార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

వెల్గటూర్ : ఎండపల్లి మండలం గుల్లకోట ప్రాథమిక పాఠశాలలో ముందస్తు ఉగాది సంబరాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ పూజారి రంగాచార్యులచే పూజాది కార్యక్రమాలు నిర్వహించి, పండగ నేపథ్యం, విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో హెచ్ఎం రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి, వివేకవర్ధిని ఉన్నత పాఠశాలల్లో ముందస్తుగా ఉగాది వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉగాది విశిష్టతపై వివరించారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్లు మచ్చ గంగాధర్, కైరం సత్యం పాల్గొన్నారు.

కళాకారులకు కాంగ్రెస్ అండగా ఉంటుంది



కళాకారులను సన్మానిస్తున్న కృష్ణారావు

మెట్‌పల్లి: కళాకారులను కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కాంగ్రెస్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. పట్టణంలోని ఎస్సారెస్పీ గార్డెన్స్‌లో లలితా కళా సమితి ఆధ్వర్యంలో ఉగాది రంగ స్థల నృత్య కేళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారుల శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కృష్ణారావు చేతుల మీదుగా వారికి ప్రశంసాపత్రాలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు మట్టెల గంగాధర్, నవీన్ కుమార్, కోటగిరి వెంకటస్వామి, చైతన్య, మర్రి భాస్కర్, చొప్పరి శ్రీనివాస్, భూపతిగౌడ్ తదితరులున్నారు.

డిప్లమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దుర్గబాయి దేశ్‌ముఖ్ మహిళ టెక్నికల్ శిక్షణ సంస్థ హైదరాబాద్‌లో మూడేళ్ల డిప్లమా కోర్సులకు ఈ విద్యాసంవత్సరం నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి వాణిశ్రీ తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలికలు, అక్రమ రవాణాకు గురైన బాలికలు, వికలాంగ బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇందులో సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్, కంప్యూటర్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సులుంటాయని, ప్రతి కోర్సులో 60 సీట్లకు గాను 240 సీట్లలో 70 శాతం వీరికి కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. బాలికలు పాలిటెక్నిక్ అర్హత పరీక్ష రాయకున్నా కనీసం పదో తరగతి ఉత్తీర్ణత ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునే వారు కుల, ఆదాయ, మరణ, ధ్రువీకరణ పత్రాలతో బాలరక్షణ భవన్‌లో సంప్రదించాలన్నారు. మే 20లోపు దరఖాస్తు చేసుకోవాలని, మిగతా వివరాలకు 9885497278 సంప్రదించాలన్నారు.

గొర్రెల షెడ్డుకు నిప్పంటించిన వారిపై చర్యలు తీసుకోవాలి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం: మండలంలోని బర్దీపూర్‌లో పూమాల దేవన్న గొర్రెల షెడ్డుకు నిప్పంటించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత యాదవ మహాసభ యూత్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రెబ్బటి రాజశేఖర్ యాదవ్ అన్నారు. బాధిత కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. గొర్రెల షెడ్ పూర్తిగా కాలిపోయి రూ. 2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం దేవన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాదవనాయకులు రెబ్బసి మధు యాదవ్, గట్టు వేణుయాదవ్, తిపిరి అశోక్ కుమార్, గుంటి నరేంధర్, తదితరులు పాల్గొన్నారు.

నోటీసు బోర్డుపై ఓటరు జాబితా

జగిత్యాల: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఓటర్ల జాబితాను మత్స్యశాఖ కార్యాలయం బోర్డుపై ఉంచినట్లు మత్స్యశాఖ అధికారి దామోదర్ అన్నారు. జాబితాలో తప్పులుంటే ఆధారాలతో మూడు రోజుల్లో కార్యాలయంలో దరఖాస్తు చేయాలన్నారు.

అయోడిన్ లోపంపై విద్యార్థులకు పరీక్షలు



అయోడిన్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

పెగడపల్లి: మండలంలోని మ్యాకవెంకయ్యపల్లి, గొల్లపల్లి మండలం రంగదామునిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో సోమవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాతీయ అయోడిన్ లోప రుగ్మత నియంత్రణ కార్యక్రమం నిర్వహించారు. మ్యాకవెంకయ్యపల్లి పాఠశాలలో విద్యార్థులు వారు ఇంట్లో వాడుతున్న ఉప్పుని తెప్పించి పరీక్షలు నిర్వహించారు. అయోడిన్ తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి అయోడిన్ ఉప్పు వాడాలని సూచించి అయోడిన్ లోపం వల్ల కలిగే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి నరేశ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సీహెచ్‌వో మహేందర్‌రెడ్డి, సిబ్బంది శ్రీకాంత్‌రెడ్డి, రమణ, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.